ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు ఎప్పుడో?

పనులు మొదలు పెట్టి మూడేళ్లు గడుస్తున్నా ఏర్పాటు కాని వైనం

గాజులరామారం, మే 22(ఆంధ్రజ్యోతి): చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసేందుకు అధికారులు మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. గతంలో రోడ్డుకు ఇరువైపులా దిమ్మలను ఏర్పాటు చేశారు. సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తారని అధికారులు చెబుతున్నారు కానీ, నేటికి సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం డివిజన్‌లోని గాజులరామారం గ్రామ చౌరస్తాలో సిగ్నల్స్ లేక వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయంలో వాహనదారులు అధికంగా రోడ్లపైకి వస్తుంటారు. గాజులరామారంలో ట్రాఫిక్ సిగ్నల్ లేక పోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడి, ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు వచ్చి హడావిడి చేసి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని చెబుతున్నారే కానీ సమస్యను పరిష్కరించడంలో అందరూ విఫలం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాజులరామారం చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


గాజులరామారం చౌరస్తా


సిగ్నల్స్ కోసం ఏర్పాటు చేసిన దిమ్మెలు

దిమ్మలను ఏర్పాటు చేశారు.. గమ్మున ఉన్నారు



గాజులరామారం చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా దిమ్మలను ఏర్పాటు చేశారు. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదు. గతంలో మేము పలుశాఖల అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చాం. కానీ అధికారులు స్పందించ లేదు.
- కస్తూరి బాలరాజు, స్థానికుడు


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మమతారఘువీర్, నర్సులు తదితరులు

నర్సుల వృత్తి మహోన్నతమైనది

హైదర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): నర్సుల వృత్తి మహోన్నతమైనదని, రోగి కోలుకున్నాక ముందుగా నర్సులనే సేవలనే గుర్తు చేసుకుంటారని స్త్రీల హక్కులు, సాధికారిత కోసం కృషి చేస్తున్న డాక్టర్ మమతారఘువీర్ అన్నారు. హైదర్‌నగర్‌లోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో జరిగిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, మాతృదినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆధునిక కాలంలో స్త్రీలు ఇంటా, బయట పనితో పాటు పిల్లల సంరక్షణలో ఒత్తిడికి లోనవుతున్నారని తెలపారు. మహిళలు తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సభకు డాక్టర్ అలూరి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వీఎస్ రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తుషారతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా శేఖర్‌యాదవ్


శేఖర్‌యాదవ్

జీడిమెట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కన్వీనర్‌గా జేకే శేఖర్‌యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. ప్రజాసేవలో ముందుంటున్న తనకు ఈపదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు.


భాగ్యరెడ్డివర్మకు నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్, కె.నాగరాజు, కె.పెంటయ్య

దళితులకు ఎనలేని సేవ చేసిన భాగ్యరెడ్డివర్మ

ఫతేనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): దళిత వైతాలికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్య రెడ్డివర్మ దళితులకు ఎనలేని సేవలు చేశారని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్, సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా గూడ్స్‌షెడ్ రోడ్డులో ఆయన చిత్రపటాన్ని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశాడని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకుడు కర్క పెంటయ్య, శారదారెడ్డి, డాకయ్య, బాశెట్టి నర్సింగ్‌రావు, గంగారాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కేసులు : తహసీల్దార్

దుండిగల్, మే 22(ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్న వారిపై కుత్బుల్లాపూర్ తహసీల్దార్ ఎఆర్ రెహ్మాన్ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండలం, పేట్‌బషీరాబాద్‌లోని యాదిరెడ్డిబండ, రంగారెడ్డి బండలోని సర్వేనెంబరు 25/1, 25/2లో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు అధికారులు సంపంగి వెంకటేష్, ఇందిరారెడ్డి, రామ్‌రెడ్డి, పాలకుంట సురేష్, లక్ష్మయ్య, పసుపుల కొండయ్య, శ్రీకాంత్, బాలకృష్ణ, దంగుల లక్ష్మి, లక్ష్మమ్మ, రావులమ్మ, ముఠారి సుక్కమ్మ, వలపు వెంకటమ్మ, నాగమణి, యాదమ్మలపై తహసీల్దార్ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


సీఐ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు చైతన్య తదితరులు

డివిజన్‌లో మత్తు పదార్థాలను అరికట్టాలి

బాలానగర్, మే 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధిలో గంజాయి, గంజాయి చాక్లెట్లు, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను అరికట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు బుధవారం బాలానగర్ సీఐ నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి బనగిరి చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సీఐని కలిసి బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలకుచెందిన యువకులు మత్తుకు భానిసలవుతున్న విషయాలను వివరించారు. భారత మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డీవైఎఫ్ఐ సభ్యుల విన్నపంపై స్పందించిన సీఐ నవీన్‌కుమార్ మత్తుపదార్థాలకు యువత భానిస కాకుండా ఉండేందుకు బస్తీలలో నిఘాను పెంచుతామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుట్టమీది కార్తీ, డీవైఎఫ్ఐ నాయకులు నగేశ్, సతీష్‌కుమార్, మల్లేశ్, శ్రీను, రాజు, అభి, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.


సప్తగిరికాలనీలోని తన నివాసంలో నాయకులతో ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం

వివేకానందనగర్‌కాలనీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అభినందించారు. సప్తగిరికాలనీలోని తన నివాసంలో బుధవారం నియోజకవర్గ పరిధిలోని గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపుకు కృషి చేయడంతోపాటు పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు శక్తి వంచనలేకుండా నాయకులు, కార్యకర్తలు పనిచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాంబయ్య, సంజీవరెడ్డి, శివాజీ, ప్రకాష్‌రెడ్డి, దుర్గారావు, పూర్ణ, హరిబాబు, సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, దేవా, వసంత్, అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

గాజులరామారం, మే 22(ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీల్లోని నాలాల్లో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రావుల శేషగిరిఅన్నారు. గాజులరామారం డివిజన్‌లోని చంద్రగిరినగర్‌లో జరుగుతున్న నాలా అభివృద్ధి పనులను మున్సిపల్ ఏఈ కళ్యాణ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్‌నేత, సింగారం మల్లేష్, మురళీ, సునీల్‌పటేల్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



ఫతేనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన హైదరాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో బోరబండ భరత్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి కాకినాడ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడిని గుర్తుపట్టిన, ఆచూకీ తెలిసిన 90003 94635 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.


లక్ష్మీదేవమ్మను పరామర్శించిన సీపీఎం నాయకులు

ఐద్వా నాయకురాలు లక్ష్మీదేవమ్మకు పరామర్శ

రామంతాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దివంగత శ్రీహరి సతీమణి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు లక్ష్మీదేవమ్మ అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఆమెను బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజే నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. లక్ష్మీదేవమ్మ త్వరగా కోలుకోవాలని, ప్రజా ఉద్యమాలలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శి వర్గ సభ్యుడు జె.చంద్రశేఖర్, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో చేపలను చూస్తున్న సందర్శకులు


మేళాలో కశ్మీర్ ప్రకృతి సోయగాలు

సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడే సందడి

● ఆకట్టుకుంటున్న కశ్మీర్ మంచుకొండల దృశ్యాలు

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా నగరవాసులు ఎదురుచూస్తున్న సమ్మర్ ఉత్సవ్ మేళా బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా ఓ వైవిధ్యతతో తయారయ్యే ఈ మేళాలో ఈసారి చల్లటి కశ్మీర్‌లో విహరించిన అనుభూతి కలిగేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంచు పడుతున్న చలి నుంచి వెళ్తున్న అనుభూతి కలిగేలా ఏర్పాటైన టన్నెల్ మరింత ఆకట్టుకుంటోంది. దీంతో పాటు అమ్యూజ్‌మెంట్ రైడ్లు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వర్తకులు తమ స్టాళ్ల ద్వారా ఎన్నో రకాల వస్తువులు, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను విక్రయానికి ఉంచారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన తిను బండారాలతో కూడిన వాటిని ఇష్టంగా ఆరగిస్తూ కుటుంబ సమేతంగా సందర్శకులు సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడి చేస్తున్నారు. ఐమాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ ఖాళీ ప్రదేశంలో ఈ ప్రదర్శన ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తెలిపారు.

నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

- నిషేధిత ద్రవ మత్తు పదార్థం, తయారీ సామగ్రి స్వాధీనం
- పోలీసులు వచ్చారన్న సమాచారంతో కీలక వ్యక్తి పరార్
- కుటుంబ సభ్యుల్లో ఒకరిని విచారించి వదిలేసిన పోలీసులు
- కలకలం రేపిన సంఘటన

మర్పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువక ముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవ మత్తు పదార్థంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సంఘటన స్థలంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి వివరాలను వారు తమ ఉన్నతాధికారులకు వివరించినట్లు చెబుతున్నారు. సంఘటన స్థలం ఏ సర్వే నెంబర్‌లోకి వస్తుంది, యజమాని ఎవరు అనే సమాచారం కోసం మహారాష్ట్ర పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. నర్సాపూర్ గ్రామంలోని సర్వే నెం.48లో ఉన్న పొలంలో రేకుల షెడ్డులో కొన్ని రోజులుగా నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతోనే మహారాష్ట్రకు చెందిన థానే పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమాచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. తాము విచారణకు హాజరు కావాలని సమాచారం ఇచ్చినప్పుడు రావాలంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డులో స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఓ వాహనంలో తమ వెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.


నర్సాపూర్‌లో ఉన్న రేకుల షెడ్డు

భార్యతో గొడవపడి వెళ్లిపోయిన భర్త

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజన్‌పాశ్వాన్(24) తన భార్య అంబిక పాశ్వాన్‌తో కలిసి నగరానికి వచ్చి కాచిగూడ పీఎస్ పరిధిలోని ఇసామియాబజార్‌లో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వీరికి వివాహం జరిగింది. రాజన్‌పాశ్వాన్ గోకుల్ ధామ్ వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 14న కారు డ్రైవర్ డ్యూటీ అయినపోయిన తర్వాత రాజన్‌పాశ్వాన్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. వివిధ ప్రాంతాలలో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య బుధవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మద్యానికి బానిసై ఆత్మహత్య

అల్వాల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ సాయినగర్, రైల్వేగేట్ ప్రాంతంలో సమీర్‌సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఆయన కుమారుడు రాణాప్రతాప్(35) మద్యానికి బానిసై డిప్రెషన్‌లోకి వెళ్లాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో నీళ్లలో బ్లీచింగ్ పౌడర్ కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ ప్రతాప్ మృతి చెందాడు.

బీఎంఎస్ఐఏ అధ్యక్షుడు అక్రమ వసూళ్లు

అధ్యక్షుడు అంబటి ఏకపక్ష ధోరణిపై మండిపడుతున్న సభ్యులు
మాజీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లరెడ్డి

బాలానగర్, మే 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మైక్రోస్మాల్, స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (బీఎంఎస్ఐఏ) అధ్యక్షుడు అంబటి సునీల్‌కుమార్ ఏకపక్ష ధోరణితో అసోసియేషన్ సభ్యులు నష్టపోతున్నారని అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లరెడ్డి ఆరోపించారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2017లో పరిశ్రమల నిర్వాహకులంతా కలిసి బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల కోసం రూ.1500 చెల్లించి అసోసియేషన్ సభ్యత్వం తీసుకున్నామని వివరించారు. స్థల కేటాయింపు విషయమై ప్రణాళిక సిద్ధమౌతున్న తరుణంలో అధ్యక్షుడు అంబటి సునీల్ బీఎంఎస్ఐఏను పక్కన పెట్టి కేకేబీ సంస్థ ప్రారంభించి 160 మందికి స్థలం ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూలు చేశాడని ఆరోపించారు. బీఎంఎస్ఐఏ సభ్యులను కాదని కేకేబీకి డబ్బులు చెల్లించిన వారికే స్థలాలు ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నాడు. తనను జనరల్ సెక్రటరీ పదవి నుంచి తొలగించినందుకు న్యాయబద్ధంగా కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహ్మద్ ఖాజ, శ్రీనివాస రాజు రాజేందర్‌రెడ్డి, చాంద్‌పాషా, ముక్తార్, లోహిత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వెంకటేశ్వర్లరెడ్డి

కృషికాలనీలో రోడ్డుకు అడ్డంగా నిర్మాణం

సర్కిల్ కమిషనర్‌కు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల ఫిర్యాదు

జీడిమెట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్ కృషికాలనీలో రోడ్డుకు అడ్డంగా అనుమతి లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ భవన నిర్మాణాన్ని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో భవన నిర్మాణదారుడికి, స్థానికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై వెల్ఫేర్ నాయకులు కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. గణపతిరావు అనే వ్యక్తి రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారని కాలనీవాసులు ఉపకమిషనర్‌కు వివరించారు. సర్కిల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకుని ఈభవనాన్ని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకుని నిర్మాణాన్ని అడ్డుకోవాలని కాలనీ అధ్యక్షుడు ఎం.భైరేష్‌గౌడ్, జనరల్ సెక్రటరీ బి.విజయ్‌భాస్కర్‌రెడ్డిలు కమిషనర్‌ను కోరారు.


వివాదానికి దారితీసిన నిర్మాణం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, మే 22(ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11కేవీ మినీ ఇండస్ట్రియల్, హెచ్ఏఎల్ ఫీడర్‌ల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు నేడు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పటేల్‌నగర్, వివేకానందనగర్, ఆర్ఎంనగర్, శ్రీనివాస్‌నగర్, 2 గంటల నుంచి 3.30 గంటల వరకు ఉషోదయకాలనీ ఫేజ్-1,2, ఇందిరానగర్, సీఎంఆర్ స్కూల్ వెనుక అపార్టుమెంట్, టీపీ నగర్‌ల్లో విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ చైత్యన్య భార్గవ్ ఒక ప్రటనలో తెలిపారు.

హైదర్‌నగర్: గురువారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు మాధవనగర్, కమల ప్రసన్ననగర్, ఫేజ్-1, దీనబంధుకాలనీలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు సాయినగర్, ఫేజ్-1, సాయికల్యాణ్‌మండపం, రాఘవేంద్రకాలనీలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

● మూసాపేట్ ఫీడర్ పరిధిలో 10 నుంచి 12 గంటల వరకు బ్రాండ్ ఫ్యాక్టరీ వెనుక, బతుకమ్మకుంట, ఎంఐజీ-877, దోబీఘాట్, రమ్యాగ్రౌండ్, చైతన్యఫుడ్‌కోర్టు, ఎంఐజీ, ఎల్ఐజీప్లాట్స్, వినాయకటెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

కొత్తపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ శైలజాపురి కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శైలజాపురి కాలనీలో నివాసముంటున్న బిల్లు మంజుల(37) బుధవారం భర్త మల్లేష్‌తో గొడవ పడింది. తర్వాత కాసేపటికి భర్త ఇంటినుంచి బయటకు వెళ్లాడు. దీంతో క్షణికావేశానికి లోనైన మంజుల పాలు నిల్వ చేసేందుకు వాడే రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను వనస్థలిపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమార్తె బొల్లు సోని ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రామకృష్ణగౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న గడ్డం రంజిత్‌రెడ్డి, ఆయన సోదరుడు నరేందర్‌రెడ్డి

ఘనంగా కార్పొరేటర్ 'దొడ్ల' జన్మదినం

హైదర్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గోదాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, ఆయన సోదరుడు నరేందర్‌రెడ్డి కార్పొరేటర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

● వీల్‌చైర్స్ పంపిణీ

కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేశారు.

● కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను మైనార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ సయ్యద్, షౌకత్ అలీమున్నా, పారూఖ్, ఖలీమ్, బషీర్, షరీఫ్, అజామ్, సత్తార్, ఖాజా, గౌస్, ఫిరోజ్, షబ్బీర్, యాకుబ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

చిన్న వర్షానికే.. సమతానగర్ మునక

- కాలనీ రోడ్లపై మోకాలు లోతు నీళ్లు
- ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు
- అవస్థలు పడుతున్న ప్రజలు


సమతానగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు (ఫైల్)

ఓల్డుబోయినపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని సమతానగర్ ప్రజల కష్టాలను నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షానికే రోడ్లన్నీ జలమయమై మోకాలు లోతు నీళ్ల రోడ్లపై చేరుతున్నాయి. వర్షంనీరు ఇళ్లలోకి చేరుతున్నాయని అంటున్నారు. కొన్నేళ్లుగా వరద సమస్యతో స్థానిక ప్రజలు సతమతమౌతున్నామని వారు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో వర్షం నీరంతా ఇళ్లలలోకి చేరి నిత్యావసర వస్తువులు, దుస్తులు సామగ్రి నీళ్లలో నాని ముద్ద అవుతున్నాయని వారు వాపోతున్నారు. బస్తీలోని నీరు బయటకు పోవడానికి పైపులు, వర్షం నీటి కాలువలు నిర్మించినప్పటికి వాటిలో పేరుకు పోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో సమస్య మొదలైందన్నారు. వర్షం పడిన ప్రతీసారీ సమతానగర్ రోడ్‌నెంబర్ 5, 6, 7లో ఇళ్లలోకి వర్షం నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షం నీటి సమస్యతో పాటు బస్తీలో పారిశుధ్య నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు వివరిస్తున్నారు.